క్లుప్తంగా

నేడ జగనన్న ఆరోగ్య సురక్ష

దుర్గి: మండల పరిధిలోని స్థానిక చెక్ పోస్టు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.సమతావాణి తెలిపారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ఎం.రమేష్ కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. పలు రకాల వైద్య పరీక్షలు మందులు ఉచితంగా అందజేసి సంబంధిత స్పెషలిస్టు వైద్యులచే శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రెంటాలలో ..

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం రెంటాల గ్రామంలో నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలోని సచివాలయం వద్ద ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నవారు ఆధార్‌కార్డుతో వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పెదకొదమగుండ్లలో..

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మెగా వైద్య శిబిరం బుధవారం జరుగుతుందని గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ ఆంజనేయులు నాయక్ తెలిపారు. డాక్టర్ ఆంజనేయులు నాయక్, పంచాయతీ కార్యదర్శి శివరామరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివసత్యనారాయణరాజు మంగళవారం సాయంత్రం వైద్య శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. వచ్చిన వారికి పరీక్షలతో పాటు మందులు కూడా పంపిణీకి అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేడు మిట్టగుడిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మిట్టగుడిపాడు గ్రామంలో 2వ రోజు బుధవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి మంగళవారం తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత



దాచేపల్లి : వ్యాసరచన పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. గాంధీ జయంతి సందర్భంగా మండలస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 1,2,3 తరగతుల విభాగంలో మొదటి బహుమతిని బొరగాని నాగ అమూల్య, 4,5 తరగతుల విభాగంలో మొదటి బహుమతి కొత్రా జ్యోతి, రెండవ బహుమతి తాడిపర్తి కార్తీక్ సాధించారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు నాగుబండి గురవులు, వందనపు వెంకట్రామయ్య, దేవళ్ల లక్ష్మీప్రసన్నలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్‌స్టాండ్ సెంటర్‌లో సులభ్ కాంప్లెక్స్ నిర్మించండి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని బస్‌స్టాండ్ సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కన్నెగంటి హనుమంతు సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ మంగళవారం మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మికి వినతిపత్రాన్ని అందచేశారు. బస్ షెల్టర్‌లో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, రైలుపేటలో హిందూ శ్మశాన వాటిక నిర్మించాలని, ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రెంటచింతల నుంచి జిల్లా కేంద్రం నరసరావుపేటకు నేరుగా ఆర్టీసీ బస్‌లు నడపాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మండల ప్రత్యేక అధికారి మహాలక్ష్మి తెలిపారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాలలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ డి.ప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గొట్టిపాళ్ళలో 2, గుండ్లపాడు 1, కండ్లకుంటలో 4, కేపీగూడెంలో 1, మండాదిలో 1, పట్లవీడులో 1, శ్రీరాంపురం తండాలో 1, వెల్దుర్తిలో 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలన్నారు. 18 నుంచి 35సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే సచివాలయ పరిధిలో సభ్యులై ఉండాలన్నారు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. క్రమశిక్షణతో నిజాయితీగా పనిచేసిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు, ఆధార్, విద్యార్హత, కుల, నివాస పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. 19న ఎంపిక చేసి 20న శిక్షణ ఇచ్చి వలంటీర్ల పోస్టులు ఎంపిక చేస్తామన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో గబ్రూనాయక్



పులిపాడులో ఓపీకి బారులు తీరిన ప్రజలు



మహిళలను పరీక్షిస్తున్న డాక్టర్



రోగులకు మందులను అందజేస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి ఒక్కరి ఆరోగ్యమే సీఎం జగన్ లక్ష్యం

ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిందని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరాంపురం తండా సచివాలయం పరిధిలోని శ్రీరాంపురం తండా, రచ్చమల్లపాడు గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీఓ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నారన్నారు. అందులో భాగంగా గ్రామాలలోని ప్రతి ఇంటిని ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు జల్లెడ పట్టి వారి ఆరోగ్య వివరాలను సురక్ష యాప్‌లో నమోదు చేసి వారికి ముందుగానే టోకెన్‌లు ఇచ్చారన్నారు. ఏడు రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించి వారికి ఇంటి వద్దనే మందులు అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ శిబిరంలో 326 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 207 మంది మహిళలు, 119 మంది పురుషులు ఉన్నారు. ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కార్డులు, మందులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్డు ద్వారా ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ పరిధిలో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించబడుతుందని పీఆర్కే వివరించారు. కాగా 29 మందికి నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు దేరంగుల ఏగయ్య, తోట బ్రహ్మయ్య, ఎంపీటీసీ గార్లపాటి మంగమ్మ, మాజీ సర్పంచ్‌లు కేతావత్ హనుమానాయక్, పార్లపల్లి పెద గాలయ్య, పాత్లావత్ లక్ష్మానాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు మేరాజోత్ గోవిందునాయక్, తోట వెంకటేశ్వర్లు, పేర్లపాటి వెంకట్రామయ్య, పిన్నెబోయిన మార్కొండయ్య, ఎంపీడీఓ డి.ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావు, వైద్యాధికారి శ్రీరామ్, ముఖర్జీ, నిజాముద్దీన్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట

పిడుగురాళ్ల: ప్రజా ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 5,6,10 సచివాలయాలు, 8,9,10,16,17,18 వార్డుల ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనారోగ్య సమస్యలతో ప్రజలు బాధపడకూడదని, ముందుగానే ప్రజలను అప్రమత్తం చేసి వారి ఆరోగ్యానికి నేను రక్షణ అనే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సీఎం చేపట్టారని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో మొత్తం 700 మందిని పరీక్షించి, వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరిగిందన్నారు. అవసరమైన వారికి వివిధ హాస్పిటల్స్‌కు రిఫర్ చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, కౌన్సిలర్లు గుర్రం అప్పిరెడ్డి, మాదాల కిరణ్‌కుమార్, షేక్ అబ్దుల్లా, పసుపులేటి ఆనంద్‌కుమార్, కత్తెరపు వాసుదేవరెడ్డి, జోగుపర్తి సుజాత ముక్కంటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, వైద్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసానే జగనన్న లక్ష్యం

మాచర్ల రూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించి వారి ఆరోగ్యానికి భరోసా కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావటం సీఎంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని లచ్చంబావి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఆరోగ్య సమాజ నిర్మాణమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని, సురక్ష పథకం కింద ఇంటింటికి వెళ్ళి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి గడపకు కార్పొరేట్ వైద్యాన్ని తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఈ శిబిరంలో 354 మంది హాజరు కాగా వారిలో 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజనీదేవి, వైద్యులు వెన్నెల, శివలీల, సర్పంచ్ మాద్యానాయక్, మాజీ సర్పంచ్ వెంకయ్య, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఆర్ఐ ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

తంగెడలో జగనన్న సురక్ష శిబిరం

దాచేపల్లి : మండలంలోని తంగెడ గ్రామంలో జగనన్న సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ కొత్తపల్లి కాశయ్య ఈ శిబిరం ప్రారంభించారు. డాక్టర్లు సుచరిత, మధు, కాశీ విశ్వనాధం, శారద, వాసు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఈఓపీఆర్డీ జోసఫ్, మాజీ సర్పంచ్ దైద నాగరాజు, స్థానిక నేతలు ఆరికట్ల మల్లారెడ్డి, గొగిరెడ్డి వెంకటరెడ్డి, వట్టె రామచంద్రారెడ్డి, దేవళ్ల వీరాస్వామి, కానర్ల నరసింహరెడ్డి, ఉప్పుతల యల్లయ్య, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రక్ష... ఆరోగ్య సురక్ష

గురజాల : పేదలకు ఆరోగ్య రక్షణ అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ)లు అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. దేశంలోనే ఎవరూ, ఎప్పుడూ ప్రజారోగ్యానికి సంబంధించి ఇటువంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు, ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ఇంటి వద్దకే వైద్య సేవలు వినూత్నంగా నిర్వహించారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరాన్ని డీఎల్‌డీవో గబ్రూనాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ ఫణికుమార్ నాయక్, వైద్యురాలు పద్మావతి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తదితరులున్నారు.



శ్రీరాంపురం తండాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

దుర్గి: ప్రజల ఆరోగ్యం గురించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. మంగళవారం మండల పరిధిలోని పోలేపల్లిలో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. పోలేపల్లి, తేరాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు, పెద్దలు హాజరై వివిధ పరీక్షలు చేయించుకున్నారు. స్థానిక సచివాలయం ఆవరణలో తహసీల్దార్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ గత 10 రోజులుగా మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశం శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేంద్రం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్వాయి అంజిరెడ్డి, గౌరు వెంకటరెడ్డి, పుచ్చకాయల కొండలు, పాకాల నాగాంజనేయులు, పుచ్చకాయల రామకృష్ణ, ఎర్రాకుల వెంకటేశ్వర్లు, దేశి శ్రీనివాసరావు, సైదులు, ఆశా వర్కర్లు, వైద్యులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులున్నారు.



వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎంపీడీఓ సమతావాణి, ప్రజా ప్రతినిధులు

ఉపాధి పనులపై అవగాహన సదస్సు



రెంటచింతల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి అధ్యక్షతన ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి పనులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేద రైతుల బీడు భూములను సాగు భూములుగా, పంట కాల్వలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. రాయితీపై చిన్న, సన్నకారు రైతులకు పండ్ల మొక్కలను అందించడం జరుగుతుందన్నారు. ఉపాధిహామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ సురేంద్రకుమార్ మాట్లాడుతూ 2024–25లో జాబ్‌కార్డు కలిగి పని అడిగిన వారికి ఖచ్చితంగా పని కల్పించాలన్నారు. పనులు గుర్తించడంలో, కూలీలకు పనులు కల్పించడంలో వివక్షత చూపించరాదన్నారు. అనంతరం ఉపాధి పనులు గుర్తింపు, కూలీల బడ్జెట్ తయారు, ప్రణాళికలపై చర్చించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, సర్పంచ్‌లు మున్నా చంద్రం, దావులూరి ఉదయకుమారి రమేష్, ఏపీఎం జి.జయచంద్ర, ఎంపీటీసీలు, ఎఫ్ఏలు, ఆయా గ్రామాల సచివాలయాల, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలి



మాచర్ల రూరల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించి వారికి ఆర్థిక భరోసా కలిపించేలా ఉపాధి హామీ పనులు నిర్వహణ చేపట్టాలని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సర ఉపాధి హామీ పనుల నిర్వహణపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కీలకంగా వ్యవహరించాలని గ్రామాలలో అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు, రైతులకు సంబంధించి వ్యవసాయ పనుల నిర్వహణలో పనులను గుర్తించాలన్నారు. చెక్‌డ్యాంలు, కల్వర్టులు, చెరువులలో పూడికతీత పనులు, పొలం గట్ల వెంబడి పిచ్చిమొక్కలను తొలగించే పనులలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి, ఎంపీడీఓ సరోజనీదేవి, ఏపీడీ సురేంద్రబాబు, ఏపీఓ నాగ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు ఉన్నారు.

అర్హుల చెంతకు సంక్షేమ పథకాలు

ఒకే ఒక్కడు సీఎం జగన్...
ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేయడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకుంటున్న దేశంలో ఒకే ఒక్క సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సీఎం జగన్ తలపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 44వ సచివాలయంలో 179వ రోజు మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో ప్రభుత్వ విప్ పీఆర్కే పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేస్తూ పథకాల ద్వారా ఎంత ప్రయోజనం చేకూరిందో వివరించి వారి సమస్యలను తెలుసుకుంటూ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తూ ముందుకువెళ్లారు. ప్రతి గడపలో ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా తమకు కలిగిన లబ్ధిని పీఆర్కేకు వివరించారు. దేశ చరిత్రలోనే ఇన్ని సంక్షేమ పథకాలు అతి తక్కువ కాలంలో అమలుచేసిన ఒకే ఒక్క నాయకుడిగా సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని దీంతో అనేక లక్షల కుటుంబాలలో సంతోష వెలుగులు విరజిమ్ముతున్నాయన్నారు. సీఎం జగన్ పాలనను దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదలకు మెరుగైన వైద్య సహాయం చేయాలనే వజ్ర సంకల్పంతో 104, 108, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నా, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలన్నా.. మీ చల్లని ఆశీస్సులు, దీవెనలు సీఎం జగన్‌కు అందించాలని కోరారు. గ్రామంలోని ఒక్కో కుటుంబం రూ.1.50 లక్షల నుంచి రూ.5.50 లక్షల వరకు లబ్ధి పొందినట్లు, జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమని రాష్ట్ర ప్రజలు 100 శాతం నమ్మకంతో ఉన్నారన్నారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ గొట్టం వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, డీడీవో, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, పీఆర్‌డీఈ పాశం శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ జినుగు లచ్చయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, జేసీఎస్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమ, సత్రశాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, పార్టీ నాయకులు పమ్మి సీతారామిరెడ్డి, బి.సంపూర్ణమ్మ, గొట్టం భాస్కర్‌రెడ్డి, దోర్నాల బంగారు రెడ్డి, ఓర్సు కాశయ్య, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మిట్టగుడిపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ పీఆర్కే

బాలలంతా చదువుకొని విజ్ఞానవంతులు కావాలి

పిడుగురాళ్ల: 18 సంవత్సరాల లోపు ఉన్నవారు బాలలేనని అందరు చదువుకొని విజ్ఞానవంతులై సమాజాన్ని నిర్మించాలని ఎక్స్ ఏజీపీ రూత్ బనియన్ అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లో కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బాల కార్మికుల నిర్మూలన, బాలల హక్కుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లెనిన్ నగర్‌లోని వీధులలో బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో మార్పు లభిస్తుందని దీనిని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఆయన తెలియజేశారు. చదువు వల్లనే దళితులు పేదలు ఆత్మ గౌరవంగా జీవించగలుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్, కార్డ్స్ స్కూల్ హెచ్‌ఎం పి.లత, బాలబాట ఏసీవో గారపాటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్మైల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు

గురజాల : స్మైల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి అన్నారు. స్థానిక శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మైల్ ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం నిరుపేదలకు, యాచకులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గణపతి సురేష్, జి.కాశీవిశ్వనాథం, చలవాది నారాయణ, బండి రవికుమార్, శాంతి స్వరూప్, చింతపల్లి ఏడుకొండలు, తదితరులున్నారు.

రేప్ కేసులో వ్యక్తికి శిక్ష

పిడుగురాళ్ల: బాలికను రేప్ చేసిన కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలికను పట్టణంలోని పిల్లలగడ్డలో నివాసం ఉంటున్న షేక్ నాగూర్‌వలి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై పలు దఫాలు అత్యాచారం చేశాడు. తనను మోసం చేశాడని తెలుసుకొన్న బాలిక పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2017 జులై 27వ తేదీ ఫిర్యాదు చేసింది. బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఎం.హనుమంతరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ముద్దాయి షేక్ నాగూర్‌వలిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణ అనంతరం గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి కేఎస్ రామకృష్ణారావు నాగూర్‌వలికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు వెయ్యి రూపాయల అపరాధ రుసుం చెల్లించాలని తీర్పునిచ్చారు. వెయ్యి రూపాయలు చెల్లించని పక్షంలో మరో 15 రోజులు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. అదే విధంగా బాలికను మోసం చేసినందుకు అదనంగా మరో సంవత్సరం శిక్ష విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామల వాదించారు. న్యాయమూర్తి ఉత్తర్వుల మేరకు నాగూర్‌వలిని గుంటూరు జిల్లా జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు.

జిల్లా కబడ్డీ జట్టుకు గుత్తికొండ విద్యార్థిని

పిడుగురాళ్లరూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన అండర్ 14 బాలికల విభాగంలో గుత్తికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్.నందిని జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైంది. నియోజకవర్గం నుంచి వెళ్లిన జట్టులో నందిని ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టులో స్థానం సాధించింది. జిల్లా జట్టుకు ఎంపికైన నందినిని గుత్తికొండ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.నిర్మల, పీడీకే నాగభూషణం, పీఈటీ సాతులూరి సురేంద్ర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఈ క్రాప్, ఈ కేవైసీ తప్పనిసరి

వెల్దుర్తి: ప్రతి ఒక్క రైతు తమ పొలాల్లో ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారో గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసి ఈ క్రాప్ చేయించుకోవాలని ఏడీఏ జగదీశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మాచర్ల పట్టణంలోని ఆర్బీకే సెంటర్‌లో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు తమ పొలాల్లో ఏ ఏ పంటలు, ఏ ఏ సర్వే నెంబర్లలో ఏ పంట సాగు చేస్తున్నారో వివరాలను గ్రామ సహాయకులకు తెలియజేయాలన్నారు. ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న వారికి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో పాటు వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

నేటితో ఈ కేవైసీకి ముగియనున్న గడువు

దుర్గి: పంట సాగు చేపట్టిన ప్రతి ఒక్క రైతు తమ పంటలను ఈ క్రాప్ బుకింగ్, ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని ఏఓ అమీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోలగుట్లలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. రైతులనుద్దేశించి మాట్లాడుతూ మిగిలిపోయిన రైతులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రంలోపు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనుల సకాలంలో పూర్తి చేయాలి

దాచేపల్లి : అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో రూ.50 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని, పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీపీ జయశ్రీ చెప్పారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చారని, ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ పరిశీలనలో సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ల రత్నం, స్థానిక నాయకులు ఉల్లేరు హనుమంతరావు, నెల్లూరి కోటేశ్వరరావు, సంకురాత్రి చిరంజీవి తదితరులున్నారు.



కేసానుపల్లిలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ జయశ్రీ

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి

కారెంపూడి: అందరూ దయ చేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కారెంపూడి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు విజ్ఞప్తి చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రకృతి ప్రేమికుడు కొమెర అంకారావు (జాజి) మంగళవారం పంచాయతీ సిబ్బంది కార్మికులను కలిసి పర్యావరణానికి ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న అనర్థాన్ని వివరించారు. దానికి స్పందనగా కార్మికులు కూడా ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని దీనివల్ల పారిశుద్ధ్య సమస్యలు కూడా పెరిగాయని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువులు వాడి ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారని దీని వల్ల డ్రైనేజీలు ప్లాస్టిక్‌తో నిండిపోయి వర్షం పడినప్పుడు రోడ్లపైనే నీరు పారుతోందని తమ అనుభవాలను వివరించారు. ప్లాస్టిక్ వాడకాలను తగ్గించడానికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కసిన్యానాయక్ మాట్లాడుతూ పర్యావరణ హితంతో పాటు గ్రామ పారిశుద్ధ్యం మెరుగుపడడానికి ప్లాస్టిక్ వాడకాలను తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తే కార్మికుల పనిభారం కూడా సగం తగ్గుతుందన్నారు. గ్రామస్తులు ఆలోచన చేసి స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వస్తు వినియోగానికి దూరంగా ఉండాలని, వ్యాపారులు కూడా సమాజహితాన్ని కోరి సహకరించాలని కోరారు. అందరూ జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈఓపీఆర్డీ, జాజి కోరారు.



కరపత్రం ప్రదర్శిస్తున్న పంచాయతీ కార్మికులు, ఈఓపీఆర్డీ కసిన్యానాయక్, ప్రకృతి ప్రేమికుడు జాజి